క్లుప్తంగా

వైభవంగా కలశ స్థాపన పూజలు

సిద్దవటం : వెంకటాయపల్లె గ్రామ శివారులోని అంభాపుర పార్థేశ్వర స్వామి ఆలయంలో గురువారం కలశ స్థాపన పూజలను వేద పండితులు రంగసముద్రం మల్లికార్జునశర్మ, సుబ్రమణ్యం శర్మలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయంలో ధ్వజ స్తంభం, నాగులు, నవగ్రహాలు, దక్షిణామూర్తి, చండీశ్వరుడి విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా గురువారం ఉదయం విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం పుట్టమట్టి అంకురార్పన, విగ్రహాలకు, యంత్రాలకు అభిషేకం, దీక్షాతోరణం స్నపనం, జలాదివాసం, మహానివేదన మంగళహారతి తీర్థ ప్రసాదాల వితరణ కార్యక్రమాలను చేసినట్టు వేదపండితులు తెలిపారు.

నాగిరెడ్డిగారిపల్లెలో గ్రామ సభ

సంబేపల్లె : మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లెలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు గ్రామ సభ నిర్వహించారు. ఈ సభకు హాజరైన మండల కన్వీనర్ ఉదయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ రబీ- 2022 పంట నమోదు వివరాలను గ్రామంలోని ఆర్బీకేలో సామాజిక తనిఖీ కోసం ముసాయిదా జాబితాను ఏర్పాటు చేశామన్నారు. అనంతరం గ్రామంలోని పలు సమస్యలపై ఆయన చర్చించారు.

రక్తాదాన శిబిరం



రక్తదాన శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న కళాశాల సిబ్బంది

రాయచోటి టౌన్ : రెడ్ క్రాస్ సొసైటీ, రెడ్ రిబ్బన్ క్లబ్ వారి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. గురువారం రాయచోటి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హర్షలత పంకజ్ ఆధ్వర్యంలో శిబిరం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏదైనా ప్రమాదం జరిగిన సమయంలో కానీ లేదా రోడ్డు ప్రమాదాలలో గాయపడి రక్తం ఎక్కువగా శరీరం నుంచి పోయి ప్రాణాలు కోల్పోతుంటారన్నారు. అలాంటి వారికి రక్తదానం చేసి ప్రాణాలు కాపాడాల్సిన ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రెడ్ రిబ్బన్ క్లబ్ కన్వీనర్ డాక్టర్ వెంకట్రావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారిని కాపాడాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. రెడ్ క్రాస్ సంస్థ జిల్లా సమన్వయకర్త సుధాకర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి రక్తదానం చేయడం కర్తవ్యంగా భావించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ మున్యానాయక్, అధ్యాపకులు శివమ్మ, శాంతకుమారి, అఫ్సనా తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు

సంబేపల్లె : మండల పరిధిలోని యర్రగుంట సమీపంలో ఉన్న బాలయోగి గురుకుల కళాశాలలో గురువారం ఇంటర్ ద్వితీయ సంవత్సం చదువుతున్న విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షా కేంద్రంలో సంబేపల్లె, చిన్నమండెం ఆదర్శ కళాశాలలు, దేవపట్ల, యర్రగుంట్ల కళాశాలలకు చెందిన 282 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 281 మంది విద్యార్థులు హాజరయ్యారు.

ప్రశాంతంగా ఇంటర్మీడియట్ పరీక్షలు

రామాపురం : మండల కేంద్రం పరిధిలోని ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం ద్వితీయ శ్రేణి పరీక్ష గురువారం ప్రశాంతంగా జరిగింది. గురువారం జరిగిన ఇంటర్ రెండో సంవత్సరం పబ్లిక్ పరీక్షలలో 240 మందికి గాను 223 మంది పరీక్షలు హాజరుకాగా 17 మంది పరీక్షకు గైర్హాజరైనట్లు ప్రిన్సిపల్ చీఫ్ శ్యామలాదేవి తెలిపారు.

పరీక్షా సామగ్రి పంపిణీ



సామగ్రిని అందజేస్తున్న ఎంఈఓ గంగిరెడ్డి

నందలూరు(రాజంపేట) : నాగిరెడ్డిపల్లె జెడ్పీ హైస్కూల్‌లో గురువారం ఉపాధ్యాయులు పుల్లయ్య తనయుడు వరప్రసాద్ ఆధ్వర్యంలో పరీక్ష విద్యాసామగ్రి పంపిణీ చేశారు. ఎంఈఓ గంగిరెడ్డి చేతుల మీదుగా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు ఇష్టపడి, కష్టపడి చదివి పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు.

గ్రామాల తరలింపుపై ఏపీఎండీసీ స్పష్టమైన హామీ

ఓబులవారిపల్లె : మూడు కాలుష్య గ్రామాల తరలింపుపై ఏపీఎండీసీ ఎండీ వీజీ వెంకటరెడ్డి స్పష్టమైన హామీ ఇచ్చినట్లు బెరైటీస్ ఆధారిత సంక్షేమ సంఘం అధ్యక్షుడు పులపుత్తూరి రామసుబ్బారెడ్డి తెలిపారు. గురువారం మంగంపేట కాపుపల్లె గ్రామంలో వారు విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల తరలింపు విషయమై ఏపీఎండీసీ ఎండీ వీజీ వెంకటరెడ్డితో సమావేశమయ్యామై మూడు గ్రామాలకు పరిహారం, పునరావాసం, ఉద్యోగాలు మే నెలలో కల్పిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారని తెలిపారు. అదే విధంగా గ్రామంలోని వృద్ధులకు ఏపీఎండీసీ అందజేస్తున్న రూ. 750లు పింఛన్‌ను రూ. 2 వేలకు పెంచుతామ హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో బెరైటీస్ ఆధారిత ప్రజా సంక్షేమ సంఘం సభ్యులు పులపుత్తూరు సుదర్శన్ రెడ్డి, మాజీ సర్పంచ్ శంకరయ్య, కోటి, యానాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిది

జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి



రాజంపేట టౌన్: పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి

రాజంపేట టౌన్ : తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించేందుకు తన ప్రాణాలను సైతం త్యాగం చేసిన పొట్టి శ్రీరాములు త్యాగం తెలుగు ప్రజలు ఎప్పటికీ మరువలేరని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి తెలిపారు. పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకొని గురువారం స్థానిక జౌళీ బజారులో ఉన్న ఆయన విగ్రహానికి ఆకేపాటి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆకేపాటి మాట్లాడుతూ దేశంలో బాషా ప్రయుక్త రాష్ట్రాలు ఉన్నాయంటే ఆ ఘనత పొట్టి శ్రీరాములుకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ న్యాయవాది వంకన గురుప్రతాప్‌కుమార్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రి రవి, ఏల్చూరు అశోక్‌కుమార్, పలువురు కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట : అమరజీవి త్యాగాల ఫలితమే ఆంధ్ర రాష్ట్రం అవతరించిందని ఈడిగ కార్పొరేషన్ స్టేట్ డైరక్టర్ దాసరి చిదానందగౌడ్ అన్నారు. పట్టణంలోని పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి వైఎస్సార్‌సీపీ బీసీ నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాధనకు ఆమరణ నిరాహారదీక్ష చేసి పొట్టి శ్రీరాములు ప్రాణాలు అర్పించి అమరజీవి అయ్యారన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ డీఆర్‌ఓ ఈశ్వరయ్య, మున్సిపాలిటీ కౌన్సిలర్లు నవీన్, తంబా సుబ్రమణ్యం, ఆర్యవైశ్య సంఘం నాయకులు యేల్చూరి అశోక్, మంచుకంటి రవి, గౌడ్‌సంఘం నాయకుడు ముద్దా సుబ్రమణ్యం గౌడ్, ధర్మన్న తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎస్పీ బెటాలియన్‌లో..

సిద్దవటం : మండలంలోని భాకరాపేట గ్రామ సమీపంలో ఉన్న ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లో గురువారం పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించామని కమాండెంటు ఎస్. శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కమాండెంటు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణలను అర్పించి అమరజీవియైన మహా పురుషుడు పొట్టి శ్రీరాములు అన్నారు. అంతేగాకుండా మహాత్మా గాంధీ బోధించిన సత్యం, అహింస, హరిజనోద్ధరణ అనే ఆశయాల కోసం జీవితాంతం కృషి చేసిన మహనీయుడని కమాండెంటు కొనియాడారు. కార్యక్రమంలో అసిస్టెంటు కమాండెంట్లు కె. వెంకట్‌రెడ్డి, పి.ఎన్.డి. ప్రసాద్, ఆర్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు, ఏఆర్‌ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వేకోడూరులో..

రైల్వేకోడూరు అర్బన్ : అమరజీవి పొట్టిశ్రీరాములు 123వ జయంతి వేడుకలు పట్టణంలోని పొట్టిశ్రీరాములు కాంస్య విగ్రహం వద్ద గురువారం ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. వారు మాట్లాడుతూ అనాడు అమరజీవి త్యాగ ఫలాలు నేటికి అనుభవిస్తున్నామని తెలియజేశారు. ప్రతి ఒక్కరూ ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

రాయచోటిలో..

రాయచోటి అర్బన్ : నేటి యువత పొట్టి శ్రీరాములును ఆదర్శంగా తీసుకోవాలని ఆర్యవైశ్య సంఘం రాయచోటి అధ్యక్షుడు పి.సురేష్‌కుమార్ కోరారు. పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని బస్టాండు మార్గంలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి గురువారం ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భాష ప్రాతిపదికన రాష్ట్రాల ఏర్పాటులో భాగంగా ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణత్యాగం చేసిన గొప్ప వ్యక్తి పొట్టి శ్రీరాములు అన్నారు. మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ యువత వారి బాటను అనుసరించాలంటూ కోరారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి కె.పి.ఎల్.నత్యనారాయణ, సుబ్రమణ్యం, సుబ్బరాజు, నాగభూషణం, శివభాస్కర్‌తో పాటు జిల్లా విద్యాసంస్థకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

సంబేపల్లెలో..

సంబేపల్లె : తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి, గొప్పతనానికి ప్రతీక అమరజీవి పొట్టి శ్రీరాములు అని సంబేపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరసింహారెడ్డి అన్నారు. గురువారం పాఠశాలలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా అమరజీవి చిత్రపటానికి పూలమాలలు వేసి, ఆయన గొప్పదనాన్ని స్మరించుకున్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఎంఈఓ రామిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



రాజంపేట: నివాళి అర్పిస్తున్న రాజంపేట వైఎస్సార్‌సీపీ బీసీ నేతలు



సిద్దవటం: పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కమాండెంట్ శ్రీనివాసరావు



రైల్వేకోడూరు అర్బన్: అమరజీవి విగ్రహానికి నివాళి అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



రాయచోటి అర్బన్: నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నేతలు, విద్యార్థులు



సంబేపల్లె: జెడ్పీ ఉన్నత పాఠశాలలో..

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి



మాట్లాడుతున్న ఏఎస్‌డబ్ల్యూఓ రఘురామయ్య

లక్కిరెడ్డిపల్లి : పదో తరగతి పబ్లిక్ పరీక్షలలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఏఎస్‌డబ్ల్యూఓ రఘురామయ్య పేర్కొన్నారు. గురువారం లక్కిరెడ్డిపల్లిలో ఎస్సీ బాలుర, బాలికల వసతి గృహాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు ఉదయం, సాయంత్రం వేళల్లో రీడింగ్ అవర్స్ నిర్వహించి మంచి ఫలితాలు కోసం కృషి చేయాలన్నారు. ప్రభుత్వం అందించిన మెటీరియల్స్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎస్సీ వసతి గృహాలలో చదివి విద్యార్థులు మంచి ఆఫీసర్లు అయ్యారన్నారు. కావున కష్టపడి చదివి ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూఓలు శ్రీనివాసులు, రమేష్ బాబు, లక్ష్మీకాంతమ్మ విద్యార్థులు పాల్గొన్నారు.

రుణాలను చెల్లించేలా బాధ్యత తీసుకోవాలి



సూచనలు చేస్తున్న ప్రాజెక్టు డైరెక్టర్ సత్యనారాయణ

వీరబల్లి : రుణాలను సక్రమంగా చెల్లించేలా సిబ్బంది బాధ్యత తీసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బండి సత్యనారాయణ అన్నారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో జరిగిన మండల సమాఖ్య సిబ్బంది సమీక్షలో ఆయన మాట్లాడుతూ సభ్యులు రుణాలు పొందే క్రమంలో సమావేశం ఏర్పాటు చేసి మంచి జీవనోపాధులను ఎన్నుకునేలా అవగాహన కల్పించడం సిబ్బంది బాధ్యత అని గుర్తు చేశారు. జీవనోపాధుల కోసం రుణాన్ని పెట్టుబడిగా చేసుకోవడం వల్ల చెల్లింపులు బాగుంటాయన్నారు. సంఘం సమావేశాలలో రుణాలను ఏ విధంగా ఉపయోగించుకోవాలి, దానివల్ల ప్రయోజనాలను తెలియజేయాలని చెప్పారు. సమావేశాలు జరుపకుండా లావాదేవీలు నిర్వహించడం వల్ల పారదర్శకత లోపించి సంఘాలు విచ్ఛిన్నం అవుతాయన్నారు. పుస్తక నిర్వహణ, లావాదేవీలు ఆన్‌లైన్‌లో నమోదు ప్రతినెల జరగాలని తెలిపారు. ప్రతినెల జరిగే అన్ని లావాదేవీలు తనిఖీ చేసుకొని సభ్యులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం ఖాదర్ వలీ, స్త్రీనిధి మేనేజర్ సుధీర్, మండల సమాఖ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మహాభారత నాటకం



మహాభారత నాటకంలో పాల్గొన్న గ్రామస్తులు

గాలివీడు : మండల కేంద్రంలోని స్థానిక చిన్నప్పరెడ్డి మిషన్ వద్ద ఏర్పాటు చేసిన మహాభారత నాటకం గ్రామస్తులను ఆకట్టుకుంటోంది. మహాభారతంలోని 18 పర్వాలను 18 రోజులపాటు ప్రదర్శిస్తున్నారు. ఇప్పటి వరకు 15 రోజులపాటు ఉదయం హరికథ, రాత్రిపూట వీధి నాటకాలు ప్రదర్శిస్తూ ప్రజలకు కనువిందు చేస్తున్నారు. ఇంతటి ఉత్సాహంతో నిర్విరామంగా సాగిస్తూ అద్భుత ఘట్టాలను కళ్ళకు కట్టినట్లు ప్రదర్శిస్తుండటంతో కార్యక్రమానికి ప్రజలు నీరాజనం పడుతున్నారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి రోజుకు వందల సంఖ్యలో హాజరై ఈ ఉత్సవాలలో గ్రామీణ కళలకు బ్రహ్మరథం పడుతున్నారు. మహాభారత ఉత్సవాలలో కీలక ఘట్టమైన అగ్నిగుండం, ఆలయ ప్రవేశం, బకాసుర బండి కుంభాలను తీసుకురావడం వంటి ఘట్టాలను ప్రదర్శిస్తూ రక్తి కట్టిస్తున్నారని పలువురు ప్రశంసిస్తున్నారు. ఆదివారం మహాభారత నాటకం అగ్నిగుండం ప్రవేశంతో ముగింపునకు చేరుకోనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

రసవత్తరంగా బండలాగుడు పోటీలు



రసవత్తరంగా జరుగుతున్న బండలాగుడు పోటీలు

ఒంటిమిట్ట : స్థానిక ఒంటిమిట్ట బజారు వీధిలో వెలసిన నడివీధి గంగమ్మ జాతరను ఆలయ కమిటీ పెద్దలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం తెల్లవారుజాము నుంచి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గంగమ్మతల్లికి జంతు బలులు అర్పించారు. అమ్మవారి వర ప్రసాదంతో జన్మించిన పిల్లలు అమ్మవారి గుడి చుట్టూ నెత్తిమీద దీపం ఉంచుకుని ప్రదక్షిణలు చేశారు. చాందినీబండ్లు, చెక్కభజనలతో జాతర అత్యంత ఘనంగా జరిగింది. జాతర పురస్కరించుకుని మధ్యాహ్నం బండలాగుడు పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో గెలిచిన వారి ఆలయ కమిటీ పెద్దల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

వైభవంగా అమ్మవారికి పొంగుపాలు



పూజలందుకుంటున్న బలిజపల్లి గంగమ్మ

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు పట్టణంలోని ప్రధాన రహదారిలో వెలసిన బలిజపల్లి గంగమ్మ, పగడాలపల్లి గంగమ్మ, బొజ్జవారిపల్లి గంగమ్మలకు గురువారం ప్రజలు, మహిళలు వైభవంగా పొంగుపాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.పలు పార్టీల నాయకులు, ప్రముఖులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. తెల్లవారుజాము నుంచి సంప్రదాయబద్ధంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి జాతర చేశారు. అనంతరం భారీ ఎత్తున మహిళలు గంగమ్మకు పొంగుపాలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు. రాత్రి అమ్మవారికి వారికి ప్రత్యేక బృందంచే భజనలు ఏర్పాటు చేశారు. అలాగే పలు గ్రామాలలో గంగమ్మకు పొంగుపాలు ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమంలో నిర్వాహకులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

27న పంచాయతీ కాంప్లెక్స్ వేలంపాట

లక్కిరెడ్డిపల్లి : ఈనెల 27వ తేదీ గ్రామ పంచాయతీ కాంప్లెక్స్ చిరు వ్యాపారస్తుల స్థలాలకు బహిరంగ వేలంపాటను నిర్వహిస్తున్నట్లు పంచాయతీ సెక్రటరీ సుదర్శన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వేలంపాటలో పాల్గొనేవారు గ్రామ పంచాయతీకి ఎలాంటి బాకీ ఉండరాదని, వేలంపాటలో పాల్గొనే ముందు లక్ష రూపాయలు, బస్టాండు గేటుకు పాల్గొనే వారు రూ. 20 వేలు చెల్లించి వేలంపాటలో పాల్గొనాలన్నారు. పాట దక్కించుకున్న వారు మొత్తం డబ్బును అదే రోజున చెల్లించాలన్నారు. వేలంపాట దక్కించుకున్న వారు 2023 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2024 మార్చి 31వ తేదీ వరకు ఏడాదిపాటు దక్కించుకున్న వారు కొనసాగించవచ్చన్నారు. ఈ అవకాశాన్ని లక్కిరెడ్డిపల్లి గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

రాజంపేటలో కుక్కల బెడదకు నివారణ చర్యలు



కుక్కలు పట్టుకున్న సిబ్బందితో చైర్మన్ పోలా

రాజంపేట రూరల్ : పట్టణ ప్రజలకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి తెలియజేశారు. మున్సిపాలిటీ పరిధిలో రోజురోజుకు కుక్కల బెడత పెరుగుతూ పోతుండటంతో మున్సిపల్ చైర్మన్ పోలా గురువారం నివారణకు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా తిరుపతిలోని అనిమల్ కేర్ ల్యాండ్ ప్రతినిధులను మున్సిపల్ చైర్మన్ పోలా సంప్రదించారు. వారిని రాజంపేటకు తీసుకువచ్చి మున్సిపాలిటీ పరిధిలోని కుక్కలను పట్టివేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ ఎం జనార్ధనరెడ్డి, వైస్ చైర్మన్ మర్రి రవి, కౌన్సిలర్లు ఎస్ నవీన్ కుమార్, గోవిందు బాలకృష్ణ, డొంకా సురేష్, ఎస్ఎండీ న్యాయమతుల్లా, తంబా, సుబ్రమణ్యం, ఖాజామొహిద్దీన్, తోటా లక్ష్మీనారాయణ, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి ధనుష్‌కు వైస్ చైర్మన్ పరామర్శ

రాజంపేట రూరల్ : పిచ్చి కుక్క దాడిలో పట్టణంలో రెండురోజుల క్రితం తీవ్రంగా గాయపడి తిరుపతిలోని కార్పొరేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థి ధనుష్‌ను మున్సిపల్ వైస్ చైర్మన్ సుమియా, మైనార్టీ నాయకులు అబ్దుల్ మునాఫ్‌లు గురువారం పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి ధనుష్ ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ధనుష్‌కు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరినట్లు తెలియజేశారు.

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం

లక్కిరెడ్డిపల్లి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామని 1998 డీఎస్సీ అభ్యర్థులు తెలిపారు. గురువారం లక్కిరెడిపల్లిలో 1998 డీఎస్సీకి ఎంపికైన ఉపాధ్యాయులు సీఎం చిత్రపటానికి పాలాభిషకం చేశారు. ఈ సందర్భంగా డీఎస్సీ ఎంప్లాయ్ యూనియన్ అసోసియేషన్ సభ్యుడు చంద్రమౌళి మాట్లాడుతూ 23 సంవత్సరాల కిందట మూలనపడ్డ జీఓను వెలికితీసి మాకు ఉద్యోగ భిక్షపెట్టిన జగన్‌మోహన్ రెడ్డికి జీవితాంతం మా కుటుంబాలు రుణపడి ఉంటాయని, 19 డీఎస్సీ ఎంప్లాయ్ యూనియన్ అసోసియేషన్ సభ్యుడు చంద్రమౌళి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తమ పాదయాత్రలో ఇచ్చిన హామీలను నెరవేర్చి నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించారని వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో 98 డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థులు పాల్గొన్నారు.

రాలుతున్న మామిడి పూత, పిందె

క్షేత్రస్థాయిలో పరిశీలించి, సూచనలు చేసిన ఉద్యాన అధికారి జయభరత్‌రెడ్డి



టక్కోలిలో మామిడి తోటలను పరిశీలిస్తున్న జయభరత్‌రెడ్డి

సిద్దవటం : పెరుగుతున్న ఉష్ణోగ్రత కారణంగా మామిడిలో పూత, పిందె రాలుతుందని ఉద్యాన శాఖాధికారి జయభరత్‌రెడ్డి అన్నారు. సిద్దవటం మండలంలోని టక్కోలి గ్రామంలో గురువారం ఆయన మామిడి తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం చాలా మామిడి తోటల్లో పిందె గోళీకాయ నుంచి నిమ్మకాయ సైజులో ఉందన్నారు. డిసెంబర్‌లో పూతకు వచ్చిన తోటల్లో దిగుబడి ఆశాజనకంగా ఉందన్నారు. కొన్ని మామిడి తోటల్లో మంచు వల్ల పూత కొంచం ఆలస్యంగా ఫిబ్రవరిలో వచ్చిందన్నారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతను దృష్టిలో ఉంచుకొని రైతు సోదరులు తగిన నీటిని, ఎరువులను చెట్లకు అందించాలన్నారు. గోళీకాయ సైజులో పిందె ఉన్నప్పుడు ఒక చెట్టు ఒక కిలో యూరియా, 750 గ్రాములు పొటాష్ వేసుకోవాలన్నారు. అలాగే పూత, పిందె రాలడం అరికట్టడానికి మల్టీ-కె 10 గ్రాములు లీటరుకి + బోరాన్ 1.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. చాలా తోటల్లో బంక తెగులు ఆకులపైన గమనించడం జరిగిందన్నారు. బంక నివారణకు సూపర్ కాన్ఫిడార్ 0.4 మిల్లీ లీటర్లు లేదా బుప్రోఫుజెన్ 2 మిల్లీ లీటర్లకు లీటరు నీటిని కలిపి పిచికారి చేస్తే నివారించుకోవచ్చునన్నారు. ప్రతి తోటలో ఎకరాకు 8నుంచి 10 పండు ఈగ నివారణకు బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని రైతులకు తెలియజేశామన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీకే వ్యవసాయ అసిస్టెంటు వంశీ, మామిడి రైతులు పాల్గొన్నారు.

సంపూర్ణ మిశ్రమ దాణాతో పాల దిగుబడి



టీఎమ్ఆర్ దాణాను పంపిణీ చేస్తున్న పంజం సుకుమార్‌రెడ్డి, పశువైద్యాధికారులు

రైల్వేకోడూరు : సంపూర్ణ మిశ్రమ దాణా వినియోగం వల్ల పాల దిగుబడులు పెరుగుతాయని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి అన్నారు. గురువారం అనంతరాజుపేట పంచాయతీలోని తంబిళ్ళవారిపల్లెలో రైతులకు మొదటివిడతగా 5 టన్నుల మిశ్రమదాణాను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పంజం మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పశుసంవర్ధకశాఖ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సంపూర్ణ మిశ్రమ దాణాను రైతులకు అందిస్తోందన్నారు. వేసవికాలంలో పచ్చిమేత తక్కువగా ఉండటంతో పశువులు, గేదెలలో సమతుల్యతను కాపాడేందుకు, పాలదిగుబడి తగ్గకుండా ఉండేందుకు ఈ సంపూర్ణ మిశ్రమదాణాను పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రస్తుతం ఈ రోజు 5 రైతు భరోసా కేంద్రాలలో 5 టన్నుల టీఎమ్ఆర్‌ను పంపిణీ చేశామన్నారు. రైతులు పెద్ద ఎత్తున ఈ దాణాను తీసుకోవడం జరిగిందన్నారు. టిఎమ్ఆర్ దాణా కొరకు రైతుభరోసా కేంద్రాలలో సంప్రదించి ఆన్‌లైన్‌లో కేజీ 6.5 రుపాయల కొనుగోలు చేయవచ్చని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రత్నమ్మ, సర్పంచ్ పెంచలమ్మ, ఎంపీటీసీలు బండారు మల్లి, జనార్ధన్‌రాజులు, సహాయ సంచాలకులు డాక్టర్ సురేష్‌రాజు, పశువైద్యాదికారులు డాక్టర్ ప్రతాప్, డాక్టర్ నాగశిరీష, ఎహెచ్ఎ హరిచరణ్, బ్రహ్మణి, రైతులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న 'మన ఊరి కోసం'



సలీం కుటుంబానికి నిత్యావసర సరుకులు అందజేసిన దృశ్యం

సిద్దవటం : మండలంలోని మాధవరం-1 గ్రామానికి చెందిన మన ఊరికోసం స్వచ్ఛంద సేవా సంస్థ వారు మానవత్వం చాటారు. మండలంలోని మలినేనిపట్నంలో నివాసం ఉంటున్న ఓబిలి సలీం అనే వ్యక్తికి ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై వెన్నెముక దెబ్బతిని అనారోగ్యంతో బాధపడుతూ సంవత్సరం నుంచి మంచానికే పరిమితమయ్యారు. కుటుంబ పోషణ భారమైనందున దిక్కుతోచని స్థితిలో మన ఊరి కోసం సంస్థను ఆశ్రయించగా, లక్కమనేని రాంబాబు సహకారంతో రూ. 23వేలు విలువ చేసే దోశ పిండి మిషన్, మరి కొంతమంది మిత్రుల సహకారంతో రూ.17వేలు విరాళాలు సేకరించి రూ. 5వేలతో చిన్నపాటి అంగడి, రూ. 8వేలకు నిత్యావసర వస్తువులు, బియ్యం, రూ. 3వేలుకు డైపర్లు, బాధిత కుటుంబసభ్యులకు గురువారం అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. మరింత మంది దాతలు ముందుకు వచ్చి సలీంకు వైద్య ఖర్చులకు సహాయం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు పుత్తా శ్రీనివాసులు, ఉప్పల రామక్రిష్ణ, వెంగయ్య, సుధీర్‌రాయల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బ్రాహ్మణపల్లి గంగమ్మ జాతర



గంగమ్మకు పూజలు చేస్తున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి

రాజంపేట రూరల్ : గంగమ్మ జాతరను మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో వైభవంగా గురువారం నిర్వహించారు. జాతరకు వేలాది మంది తరలిరావడంతో బ్రాహ్మణపల్లిలో ఆధ్యాత్మిక వాతావరణం కనిపించింది. గంగమ్మను పసుపు, కుంకుమ, పట్టు వస్త్రాలు, గాజులు, పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారి దర్శనానికి రాజంపేట మండలంతోపాటు సమీప మండలాల నుంచి ప్రజలు వచ్చారు. మహిళలు పొంగళ్లు పొంగించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

ఆకేపాటి ప్రత్యేక పూజలు

జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి జాతరలో పాల్గొని గంగమ్మకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. జాతరలో పాల్గొనేందుకు విచ్చేసిన ఆకేపాటిని గ్రామస్తులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. గ్రామ దేవతలను పూజించడం వలన వర్షాలు సమృద్ధిగా కురిసి గ్రామాలు సుభిక్షంగా ఉంటాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఆకేపాటి వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు, వివిధ విభాగాల కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.